# ఉదయసముద్రం

-ఎలికట్టె శంకర్‌రావు

పడమటికొంగిన పొద్దు కమ్మరి కొలిమిల నుంచి తీసిన రోకలి పొన్నోలిగుంది. ఉస్మానియా పీజీ కాలేజి సంటరు నుంచి పిల్లలు గుంపులు గుంపులుగా బెయిటి కొస్తుంద్రు. కాలేజి బవంతంత యెత్తు యెదిగిన అశోక చెట్ల నుంచి అప్పుడోటి అప్పుడోటి యెండుటాకు రాలి పడుతుంది. గేటుదాంక గుంపుగా వొచ్చిన పిల్లలు తర్వాత యిరుకు తోవలో గొర్లోలిగ వొకలెనుకంగ వొకలు నడుస్తుంద్రు. అంత ఎడమరోకు తిరిగి మెయిన్ రోడ్డు మీదికి పోతుంటె ఒకటి రొండు జంటలు కుడిరోకు తిరిగినయ్.

కాలేజి పొరిగోడకు ఆనుకుందా అన్నట్టు వుంది ఉదయసముద్రం. కుడిరోకు మల్లిన జంటలు ఒకలి మాటలు వొకలికి యినబడనంత దూరంలో నడుసు కుంట గుసగుసలాడుతున్నయ్.

ఉదయసముద్రం కాలేజి ఆడపిల్లల గుండెలోలిగ నిండుగ- నిశ్శబ్దంగా వుంది. ఉదయసముద్రాన్ని పీజీ సంటరును సూస్తె టాంక్‌బండ్ పక్కన ఆర్ట్స్ కాలేజి పెట్టినట్టుగా కనిపిస్తుంది.

విశాలంగా పర్సుకున్న ఉదయసముద్రం కట్టమీది నుంచి చిన్న చిన్న అలలను ఎగురుతున్న పిట్టలను మైమర్సిపోయి సూస్తుంద్రు. ఒకలి చేతిలో చేయేసుకొని నడుస్తుంద్రు గాయత్రి, రఘులు.

'ఏంది రఘూ! ఎన్నడు నీళ్లను సూడనట్టు అంత యిదిగా సూస్తున్నవ్?' గాయత్రి గుండెల మీది చున్నీ సరిచేసుకుంట అడిగింది.

రఘు కన్నుకొట్టకుంట సముద్రాన్ని సూసుకుంట 'నేను ఎదిగే నాటికి మావూల్లె చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయినయ్. నల్లగొండ జిల్లాల జలాశయమంటె యిదేగా? అన్నడు.

'అదేంది నాగార్జునసాగర్ వుందిగా?'

'ఉంది. డ్యాం మాత్రమే వుంది కాని నీల్లు మనయ్ కావు. ఈ నీల్లు ఒకొక్క సుక్క యిక్కడి పొలాలకు పారుతుందని తల్సుకుంటె సంబూరమైతుంది' చెరువులో తెప్పల మీద తిరుగుతున్న బెస్తోల్లను సూసుకుంట అన్నడు.

రఘుది యవుసాయ కుటుంబమని తెల్సు గాయత్రికి. ఇక్కడి నేల నీల్లు లేక యెట్ల యెండిపోయింది, యిక్కడి రైతులు నీల్ల కోసం ఎంత మొకం వాసింది అతని మాటల్లో శానాసార్లు విన్నది.

'అక్కడ కూసుందామా?' కట్టలోపలిరోకు రాతి కట్టడాన్ని సూపించింది గాయత్రి.

సదునైన రాల్లను సూసుకొని కూసుంద్రు ఇద్దరు.

'రఘూ! ఇంకో రొన్నెల్లలో పీజీ అయిపోతుంది?' తర్వాత ఆలోచనేంది అన్నట్టుగా అడిగింది.

'అదే వెంటాడే ప్రశ్న. భవిష్యత్తు తల్సుకుంటె గందరగోలంగా అనిపిస్తుంది. బీయాడి చేసి నాలుగేండ్లు అయితుంది. సర్కారు మారినా డియస్సీ ఊసే యెత్తటం లేదు. జూన్ టూ మార్చి ఉజ్యోగాల గురించి ఆలోచించే సర్కారుకు నిరుజ్యోగ సమస్య గురించి ఆలోచించటానికి తీరిక లేదేమో!' రఘు పొడుగ్గా గాలొదిలిండు.

'మీ నాన్న వాలెంటరీ రిటైర్‌మెంటు తీసుకుండని చెప్పినట్టు గుర్తు?'

'అవును. ఆరేండ్ల సర్వీసుండంగనే ప్యానల్ యెడ్‌మాస్టర్‌గా వాలెంటరీ రిటైర్‌మెంట్ తీసుకుండు ఆ ఉజ్యోగం నాకొస్తదని. తొమ్మిదేండ్లయింది. మా నాయిన ఆశలు అగో వొడ్డుకు తాకే ఆ నీటి అలలోలిగనే చెదిరిపోతున్నయ్. పన్నెండేండ్ల కింద వీఆరెస్ తీసుకున్నోల్ల పిల్లలే ఆఫీసుల సుట్టు చెప్పులరగ దీసుకుంటుంద్రు. జల్మలో మా నాయిన ఉజ్యోగం నేను చేస్తనన్న నమ్మకం లేదు' నీటిలోకి రాల్లను విసురుకుంట నిట్టూర్సిండు రఘు.

'రఘు మరీ అంత యిదిగా ఆలోచించకు. ఇదికాకపోతె యింకోటి. డీలాపడిపోతె యెట్ల?' వాతావరణం తేలిక పర్సటానికన్నట్టుగా భుజం మీద చెయ్యేసింది. రఘు తేరుకొని గాయత్రి మొకంలోకి సూసిండు. గాయత్రి నవ్వుతూ రఘు యెదమీద తలవాల్సింది.

'ఆ పొద్దు అట్ల నిలిచి పోతె యెంత బావుండు' రఘు చాతి మీద వేళ్ళతో రాసుకుంట గోముగా అన్నది.

వాతావరణం సల్లబడ్డది. సముద్రం మీది నుంచి సల్లని గాలి వొంటికి తగిలి హాయిగొలుపుతుంది. సముద్రం మీద అంతసేపు తిరిగిన చిన్న చిన్న తెప్పలు వొడ్డుకొస్తున్నయ్. కట్టమీద అక్కడక్కడ బెస్తోల్లు గంపలు నెత్తినబెట్టుకొని తెప్పల కోసం అండ్ల వొచ్చే తమ మొగోల్లకోసం యెదురు సూస్తుంద్రు.

కట్టమీద అలికిడి పెరిగింది. అప్పటిదాంక యెక్కన్నో దూరంగ రాల్లమీద మరుగున వున్న జంటలు లేస్తున్నయ్. విశాలమైన కట్టమీద దూరం నుంచి నడి చొస్తున్న మనుసులు నిలువుగా నడిచే నల్లచీమ లోలిగ కనిపిస్తుండ్రు.

'రఘు లేద్దామా?'

గాయత్రి చెయ్యి పట్టుకొని లేసిండు రఘు. కాలేజి పిల్లల కోసం యెదురుసూసే ఆటోలు యెల్లిపోయినయ్. గుడిసె ఓటలు బందయ్యింది. రోడ్డు మీద జంగిడిబర్లు ఒకదానికోటి దాసుకుంట నేషనల్ హైవే మీద లోడు లారీలోలిగ ఊల్లెకల్ల పోతున్నయ్.

దుమ్ము మబ్బులోలిగ లేస్తుంటె ముక్కులకు దస్తీలు అడ్డంపెట్టుకొని నిలబడ్డరు. అంత దూరంలో ఛాయా సోమేశ్వరాలయం నల్లబోడోలిగ కనిపిస్తుంది.

పొలాలు దున్నటానికి వొచ్చిపోయే టాక్టర్ల వల్ల మట్టిరోడ్డు చిత్తడి చిత్తడిగా వుంది. చుట్టూ పొలాల నుంచి జాలువారిన నీల్లు. బాట పక్కన నీటి గుంటల్ల జమ్మి యేపుగా పెరిగి పర్సుకుంది.

అడుగులో అడుగేసుకుంట నడుస్తుండ్రు.

'పొనగల్లు ఊల్లెదాంక నడవాల్సిందే. అక్కడుం టయ్ ఆటోలు' అన్నడు రఘు.

గాయత్రి నవ్వుకుంట 'మాట్లాడుకుంట నడుద్దాం' అన్నది.

రోడ్డుకు యెడమ పక్కన విశాలంగ పర్సుకోనున్న తెల్లబండ. దాని మీద వొంట చేస్తున్న బాతులోల్ల కుటుంబాలు. చింపిరి జుట్టు పిల్ల వొకతి వొలతో కట్టిన దొడ్లెకు బాతులను తోల్తుంది. కుంటుకుంట నడుస్తున్న బాతును మెడపట్టుకొని లేపి కాలు దిక్కు సూస్తుంది. బాతు కాలులో ముల్లు యిరిగినట్టుంది. తీయటానికి ప్రయత్నం చేస్తుంది. బండమీది వోరోకు బుట్టల్ల వొరిపొట్టు పోసి పేర్సిన గుడ్లు - ముగ్గు బుట్టలోలిగున్నయ్.

పొనగల్లు ఊరిబైటనే ఆటోల స్టాండు.

ఆటో వానికి అడ్రసు చెప్పి యెక్కిండ్రు. అప్పటికే కపర కపర చీకటి కమ్ముకుంటుంది.

❖ ❖ ❖

గాయత్రి తల్లి యెదురు సూసుకుంట గేటుకాడ కాలుగాలిన పిల్లోలిగ తచ్చాడుతుంది. ఉసూరుమంటు వొచ్చిన బిడ్డనుజూసి 'ఇంత లేటయ్యింది?' గాబరాగా అడిగింది.

'కాలేజి నుంచి ఫ్రెండ్ వాళ్ళింటికి పోయిన్నమా' సంజాయిషీగా చెప్పి ఆగకుంట తల నేలకేసుకొని లోప లికి పోయింది.

గాయత్రి తల్లి బ్లాండినమ్మ మాత్రం బిడ్డ సమాధా నానికి సంతృప్తి పడలేదు. భర్త రామశర్మ కుర్సిల కూసొని అదే పనిగా టీవీ వార్తలు సూస్తుండటం ఆమెకు చికాకు తెప్పించింది. భర్త చేతుల రిమోట్ గుంజుకొని 'ఏంది మీరు? ఆడపిల్ల - ఎటు తిరుగుతుందో ఎప్పు డొస్తుందో గూడ పట్టించుకోరు' చిటపటలాడింది.

రామశర్మ భార్య దిక్కుజూసి నవ్విండు. ఆయన నవ్వులో తమ ప్రేమ, తిరుగుల్లు కనిపించినయ్ బ్లాండి నమ్మకు. గమ్మున రిమోట్ భర్త చేతుల పెట్టి గిరక్కున యెన్కకుమల్లింది.

కాల్లు జేతులు కడుక్కొని వొస్తున్న కూతుర్ను 'స్టెల్లా యిదేం బాలేదు. ఒకటికి పదిసార్లు చెప్పటానికి నువ్వు మరీ చిన్న పిల్లవుకాదు' కోపంగా అన్నది.

స్టెల్లా గాయత్రి పకపకా నవ్వుకుంట తల్లి మెడసుట్టు చేతులేసి అల్లుకుంది 'అమ్మా యెందుకంత కంగారు పడతవ్? నేను మరీ అమాయకురాలిని కాదులే' అన్నది.

'ఏమో నమ్మా' అనుకుంట టీవీ హాల్లకొచ్చింది తల్లి. యెన్కంగనే గాయత్రి వొచ్చింది.

తల్లీ బిడ్డలను సూసిన రామశర్మ టీవీ వాల్యూం తగ్గించి 'గాయత్రీ' అని పిలిసిండు. ఆ గొంతులో ఏదో కొత్తదనం వినిపించింది.

## నానీలు..

గడచిన కాలం
పగిలిన అద్దం..
కావవి / మళ్ళీ మన సొంతం!
అమ్మ / చావడానికి సిద్ధం..
ఆమె ఒంటిపై
నగలకై తనయుల యుద్ధం!
అన్యోన్యంగా ఉంటేనే / ఆలి..
లేదంటే అవుతుంది / మహంకాళి!
నేటి టీవీ / సీరియళ్ళు..
ఇద్దరు పెళ్ళాల
ముద్దుల మొగుళ్లకు ఆనవాళ్ళు!
పేరుకు / స్త్రీవాద కవి..
సతిని
వేధించని రోజుండదు మరి!

-దాస్యం సేనాధిపతి

## పండుగ

అంతరంగాల్లో చీకటి మేఘాలు
కళ్ళనిండా కల్మషాల నీడలు
ఇంకా మొలకెత్తుతున్న విషబీజాలు
ఈర్ష్యా ద్వేషాల తుఫాను
స్వార్థం అసూయల వడగళ్ళు
ఐనా! వాళ్ళంతా ప్రశాంతంగానే కనిపిస్తారు
నిర్మలంగానే ఉంటారు
అడుగడుగునా అజ్ఞానపు జాడలు
అణువణువునా అహంభావపు ఛాయలు
పసలేని పలకరింపులు
ఉత్తుత్తి కరచాలనాలు
ఆప్యాయత లేని ఆలింగనాలు
    మనస్సు కురూపి తనానికి
    కొత్తబట్టల మాస్క్ తొడిగి
    పర్ఫ్యూంల పరిమళాలతో
    కృత్రిమంగా అలంకరించి
    జన సందోహంలో ఊరేగిస్తారు
ఇది పండగ
వాళ్ళ పాపిష్టి పనులకు చేసుకునే
వేడుక
    మనుషుల్నే కాదు
    దైవాన్నీ వంచించేవాళ్ళు
    కోరికలు లేకుండా పూజలు చేసే
    సాహసం లేనివాళ్ళు!
    అగరొత్తుల సువాసనలై
    దేవుళ్ళ చిత్రపటాల ముందు గుబాళిస్తేనేం?
    మనో మాలిన్యపు దుర్గంధాన్ని
    తొలగించుకోలేకపోవడమే విషాదం
పండగంటే
క్యాలండర్లలో వెతుక్కునేది కాదు
మనుష్యుల్లో మనస్సుల్లో వెతుక్కోవాల్సింది
మమతలూ మానవ సంబంధాలు
గాఢంగా పెనవేసుకుపోయి సమాజం నిండా
మానత్వం పరిమళించినప్పుడే
నిజమైన పండగ

**–కారం శంకర్**

గాయత్రి తండ్రి దగ్గరకు పోయి నిలబడ్డది. బిడ్డ తల మీద చెయ్యేసి నిమురుకుంట మొకంలోకి సూసిండు. గాయత్రి కండ్లల్లో ఏదో బెరుకు కనిపించింది. తను విన్నది నిజమే అనుకుండు

'గాయత్రీ జీవితం వేరు ప్రేమ వేరమ్మా' అన్నడు ఏదో ఆలోచిస్తున్న మనిషోలిగ.

గాయత్రి కంగారును దాసుకోవటానికి ప్రయత్నం చేసుకుంట 'ఏంది నాన్న?' అమాయకంగా అడగ బోయింది.

'స్నేహాలు, ప్రేమలు కాదననమ్మా. నాకు వాటి మీద నమ్మకముంది' గతం యాదికొచ్చి ఆగిండు. గాయత్రి తల్లి దిక్కు తండ్రి దిక్కు మార్చి మార్చి సూసింది.

'ఆర్థిక స్వాతంత్ర్యం లేని ప్రేమలు నిలవటం కష్టమమ్మా. నేనెందుకు చెపుతున్ననో అర్థం చేసుకో. జీవితంలో ప్రేమ కంటె కెరీర్ – డబ్బు ముఖ్యం' అనుభవసారాన్ని రంగరించినట్టుగా చెప్పిండు.

'స్టెల్లా! నిన్ను తప్పుబట్టటం కాదుగాని ఆ రఘు గురించి ఆలోచించినవా? ఉజ్యోగం సజ్యోగం లేదు. వొస్తదో రాదో తెల్వదు' తల్లి మాటలకు తెల్ల మొక మేసింది గాయత్రి. అయితే తన తల్లిదండ్రులకు అంతా తెలుసన్నమాట. ఇంక దాయటమెందుకు?

'రఘు నాతోపాటు పీజీ చేస్తుండమ్మా. బీయిడీ కూడా ఉంది' అన్నది.

'ఇయ్యాల రేపు అందరు సదువుతరు. ఉజ్యోగాలు కొందరికే వొస్తయ్. అందులో వెంకటనర్సింహరావు కొడుకని తెలిసింది. ప్రభుత్వం ఉజ్యోగాలిస్తుందా అనేది వొక ఎత్తయితె – వోపన్ కేటగిరిలో ఉజ్యోగం సంపా యించగలడా అనేది ఇంకో ఎత్తు' రామశర్మ గొంతులో బిడ్డ బతుకు గురించిన ఆందోళన.

'స్టెల్లా మా మాట విను. లేదూ నీ యిస్టమను కుంటే... మల్లా నా మూలాల్లో కలిసిపోతవ్' తల్లి గొంతు కరుగ్గా వినిపించింది.

గాయత్రి నోట మాట రాక నిలబడ్డది.

'నావైపు దూరపు బంధువుల్లో ఒకసాఫ్ట్‌వేర్ యింజ నీరుండు. నన్ను, నా ఉజ్యోగాన్ని జూసి – మా పెండ్లిని పక్కనబెడుతుండ్రు. నా మాటిని ఆ పిల్లగాన్ని చేసుకో. రేపో మాపో స్టేట్స్‌కు పోయే చాన్సుంది' రామశర్మ గొంతులో ఆరాటం కనిపించింది.

'నీ మంచి కోసమే చెపుతున్నం తల్లీ'

తల్లి మాటతో అక్కన్నుంచి కదిలింది గాయత్రి.

ఉదయసముద్రం మీది అలలు ఒక్కసారిగా గాయత్రి మనసులో కదిలినయ్.

రామశర్మ మాట్లాడాల్సింది అయిపోయినట్టుగా టీవీ వాల్యూం పెంచిండు.

❖ ❖ ❖

సందేళ కిరణాలు పడి పోతపోసిన యిత్తడి విగ్రహమోలిగ కనిపిస్తుండు రఘు.

ఉదయసముద్రం కట్ట మీద కూసొని మైమర్సిపోయి యిద్దరు అలల దిక్కుసూస్తుండ్రు. ఇద్దరి మనసులో ఎగిరిపడుతున్న అలలు. రఘు గాయత్రి మీదికి సూపు దిప్పిండు. చేయి తిరిగిన శిల్పి చెక్కిన నల్లరాతి విగ్రహ మోలిగ కనిపించింది గాయత్రి.

ఆ సూపుల నుంచి తప్పుకోవటానికన్నట్టుగా గువ్వ పిల్లోలిగ రఘు వొళ్లె వొదిగిపోయింది.

'రఘూ యింకో నాలుగు రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్' గుసగుసగా అన్నది.

'అవును' అంతకంటె చిన్నగా గాయత్రి చెవిలో గునిగుండి రఘు.

'మనం యింత తీరికగా కల్సుకోవటానికి వీలుం డదేమో?' రఘు మౌనంగా గాయత్రి మొకంలోకి సూసిండు. 'మనం సీరియస్‌గా మాట్లాడుకోవాలె' గాయత్రి లేసి డ్రస్సు సరిచేసుకుంట అన్నది.

చెప్పమన్నట్టుగా కండ్లతోనే అడిగిండు రఘు.

'మన పెండ్లి గురించి ఏమనుకుంటున్నవ్?' గాయత్రి మనసులో గాలి దుమారం.

ఇంకా ఆలోచించలేదు? రఘు సముద్రంలోకి సూపులను మల్లించిండు.

'కాని మా అమ్మా నాన్నలు ఆలోచించిండ్రు' తల వొంచుకొని చెప్పింది.

'ఏమన్నరు?' రఘు గుండెల్ల లబ్‌డబ్ మన్న సప్పుడు పెరిగింది.

'ప్రేమకంటె జీవితం ముఖ్యమన్నరు'

'ఆఁ' తన చెవులు విన్నది నిజమా అన్నట్టు అడి గిండు.

'జీవితం విలువైందన్నరు. పొరపాటును సరిదిద్దు కోలేమన్నరు'

'అసలు సంగతి చెప్పు' రఘు అర్థంకాక అడిగిండు. 'కేరీరు ముఖ్యమన్నరు' గాయత్రి పక్క సూపులు సూసుకుంట అన్నది.

పెద్ద అలవొకటి ఎగిరి పడుకొంట వొచ్చి వొడ్డును ఢీ కొట్టింది.

'నా కొడకా తిక్కశెకలు జెయ్యకు. ప్రేమా దోమా బువ్వబెట్టేయి కావు. నేను కులం గురించి కాదు అనేది. నీ బతుకు బాగుపడ్తదనుకుంటె, భవిష్యత్తు ఉంటదను కుంటె యే మాదిగోని బిడ్డను జేసుకున్నా నేను అడ్డుజెప్పను. బతుకుదెరువు ముఖ్యం. మీ మావకు అయిద్రాబాదులో కాలెజి ఉంది తెలుసుగదా! పీజీ అయిపోగానే పోయిజేరు. బంగారం అసుంటి మ్యాథ్స్ బతుకుతవ్. నీ పద్ధతి బాగుంటె వొక్కతే బిడ్డ యిచ్చినా యిచ్చి పెండ్లి జేస్తడు. చెప్పాల్సింది చెప్పిన బాగుపడ తవో నాశనమైతవో నీ యిష్టం' ముందు యెనక లేకుంట ఫటాఫట్ మని చెప్పిన తండ్రి మాటలు యాదికొచ్చినయ్ రఘుకు.

'రఘూ! ఏంది ఎటో ఆలోచిస్తున్నవ్?' గాయత్రి భుజం మీద చెయ్యేసి అడిగింది.

'ఏం లేదు కేరీరు ముఖ్యమంటె మా నాయిన అన్న మాటలు యాదికొచ్చినయ్'

'ఆలోచించిన. నాకు మా అమ్మ వాల్లు చెప్పిందే నిజమనిపించింది. మా నాన్న వాల్లు చూసిన సాఫ్ట్‌వేర్ యింజనీరును చేసుకుందామనుకుంటున్న.'

రఘు సడీసప్పుడులేకుంట నిబ్బరంగ కూసుండు.

'బాధపడుతున్నవా?' అడిగింది.

'లేదు కేరీరు గురించి ఆలోచిస్తున్న'

గాయత్రి లేసి రఘు చేతిని పట్టుకొని లేపింది.

'నేను హైదరాబాదు పోతున్న. మా మామ కాలేజీలో జాయినయితున్న.'

ఇద్దరు ఒక నిర్ణయానికొచ్చిన వాల్లోలిగ నడు స్తుండ్రు.

సముద్రంలోని తెప్పలు వొడ్డుకు చేరుకుంటున్నయ్. కట్టమీద మనుసుల అలికిడి, అంత దూరంలో గుమి కూడిన జెనం. కట్ట కింద పోలీసు జీపు కనిపించింది.

గుంపు కాడికిపోయిండ్రు. అప్పుడే వో తెప్ప వొడ్డుకు చేరుతుంది. అంతా అటు దిక్కే సూస్తుండ్రు. పోలీసులు జెనాన్ని పక్కకు జరుపుతుండ్రు.

ఆగిన తెప్పల నుంచి రొండు పీనిగలను బెస్తోల్లు దించిండ్రు. ఆడమొగ – పడ్చుపిల్లలు. ప్రేమికులేమో!

థ్యాంక్ గాడ్ మన శవాలు కావు అనుకుండ్రు యిద్దరు.

పడమట పొద్దుకుంగుతుంది. తూర్పున పున్నమి చెంద్రుడు ఉదయిస్తుండు.

ఆకాశం ప్రశాంతంగానే ఉంది. ■